క్లుప్తంగా

పైపులైన్ల నిర్మాణ పనులకు భూమిపూజ



దాచేపల్లి: ఇంటింటికి తాగునీరు అందిస్తామని సర్పంచ్ కూసం నాగిరెడ్డి అన్నారు. మండలంలోని శ్రీనగర్ గ్రామంలోని ప్రతి ఇంటికి కృష్ణా జలాలు అందించేందుకు రూ.22లక్షల నిధులతో పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులకు గురువారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో ఇంటింటికి సురక్షితమైన తాగునీటిని అందిస్తామని, తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని సర్పంచ్ నాగిరెడ్డి చెప్పారు. త్వరితగతిన ఈ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఎంపీటీసీ ఆకూరి కాశిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మారెడ్డి, ఏఈ అంగడి సోమయ్య, స్థానిక నాయకులు వణుకూరి శంకర్‌రెడ్డి, మందా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి దీక్షను జయప్రదం చేయాలి

గురజాల: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పల్నాడు జిల్లా ఫ్యాక్టో చైర్మన్ బెజ్జం సంపత్ బాబు కోరారు. స్థానిక ఏపీ ఎన్జీవో హోంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 12వ తేదీ నరసరావుపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద జరిగే నిరసన దీక్షను విజయవంతం చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నెంబరు 117ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ కన్వీనర్ తాళ్లూరి అరుణ్‌కుమార్, కందుకూరి ప్రసాద్, మొగిలి రమేష్, జె.రామారావు, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఉచిత రక్త గ్రూపు పరీక్షలు

మాచర్ల: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఈ నెల 12న శనివారం రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా బ్లడ్ గ్రూపులు తెలిపే పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మున్సిపల్ కమీషనర్ ఈవీ రమణబాబులు ప్రారంభిస్తారన్నారు.

ఎన్‌ఎస్‌పీ కాలనీలో చెట్లు నరికివేత



కారెంపూడి: స్థానిక ఎన్‌ఎస్‌పీ కాలనీలో భారీ వృక్షాలను నరికి వేస్తున్న ఘటనలు స్థానికులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కాలనీకి చాలా అందాన్ని, ఆహ్లాదకరమైన వాతావరణం చేకూర్చుతూ సుమారు 70 ఏళ్ల వయసున్న భారీ వృక్షాలను పూర్తిగా తొలగిస్తున్న ఘటనలు చోటు చేసుకున్నాయి. సాక్షాత్తు డీఈ, ఏఈ కార్యాలయం ముందున్న భారీ వృక్షాన్ని పూర్తిగా కొట్టేశారు. అలాగే మరో నాలుగు చెట్లు కొట్టేశారు. ఈ నేపథ్యంలో కాలనీ ఏఈని వివరణ కోరగా గాలులకు కొన్ని కొమ్మలు విరిగిపడ్డాయని దీంతో పాటు భవనాల పైకి వాలిన కొమ్మలను సిబ్బందిని కొట్టమన్నామని, కాని వృక్షాలను పూర్తిగా నరికివేయమనలేదని విచారించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై అలాంటి ఘటనలు పునావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు పలు పోటీలు



మాచర్ల: పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర న్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో నాగసాకి, హిరోషిమా డే సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం, చిన్నారులకు పలు పోటీలు నిర్వహించారు. ఎంఈఓ నాగయ్య ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

జవాబుదారీతనం కోసమే సామాజిక తనిఖీ

అమరావతి: గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీల వలసలను నివారించటానికి అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేసిన ప్రజాధనానికి పథకంలో పనిచేసే ప్రతి ఒక్కరు జవాబుదారీగా ఉండాలని ఎంపీపీ మేకల హనుమంతరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డ్వామా పీడీ జోసఫ్ కుమార్ పాల్గొని రికార్డులను పరిశీలించారు.

సామాజిక న్యాయానికి పెద్దపీట

- నియోజకవర్గంలో ఇప్పటికే 60 శాతానికి పైగా స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు..
- మున్సిపల్ చైర్మన్‌గా ఈ దఫా ఎస్సీ వర్గానికి చెందిన చిన ఏసోబుకు అవకాశం



ప్రభుత్వ విప్ పీఆర్కేను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన చిన ఏసోబు

మాచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రి వర్గంలోనూ, పలు కార్పొరేషన్ల పదవుల్లోనూ, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లోనూ ఇలా అన్నిచోట్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 శాతంకు పైగా ఇచ్చి అవకాశం కల్పించారు. సీఎం వైఎస్ జగన్ బాటలో నడుస్తూ ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 60శాతంకు పైగా ఆయా మండలాలలో గ్రామాలలో, సొసైటీలలో అవకాశం కల్పించి పదవులిచ్చారు. అందులో భాగంగా 1983లో మాచర్ల మున్సిపాల్టీ ఏర్పడినప్పటి నుంచి ఎస్సీ సామాజిక వర్గాన్ని ఎవరినీ పట్టించుకోలేదు. మాచర్ల పట్టణంలో అధిక సంఖ్యలో ఉన్న మాదిగలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ విప్ పీఆర్కే మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేస్తూ మూడవ దశలో మాచర్ల పట్టణంలోని 18వ వార్డుకు చెందిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన చిన ఏసోబుకు అవకాశమిచ్చి మున్సిపల్ చైర్మన్‌గా ఎంపిక చేయగా శుక్రవారం చిన ఏసోబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఏడుగురు దళిత వర్గాలకు, ఒక కో–ఆప్షన్ మెంబర్ కేటాయించి అవకాశం కల్పించారు. మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్‌గా మొదటి విడత బీసీ వర్గానికి చెందిన పల్లపాటి గురుబ్రహ్మం, వైస్ చైర్మన్ చల్లా శ్రీను, వెనుకబడిన చెంచు సామాజిక వర్గానికి చెందిన మండ్లి పెద మల్లుస్వామిని మాచర్ల జెడ్పీటీసీగా ఎంపిక చేసి ఏకగ్రీవం చేశారు. పురపాలక సంఘ చైర్మన్‌గా వడ్డెర వర్గానికి చెందిన తురక కిషోర్, మాచర్ల ప్రభుత్వాసుపత్రి అధ్యక్షుడిగా బత్తుల ఏడుకొండలు, యాదవ సామాజిక వర్గానికి చెందిన బూడిద శ్రీనివాసరావు తల్లి మంగమ్మకు ఎంపీపీగా, మాచర్ల సొసైటీకి బీసీ వర్గానికి చెందిన వెంకట్రామయ్య, రెంటచింతల మండలం ఎంపీపీగా బీసీ సామాజిక వర్గానికి చెందిన దాసరి చౌడేశ్వరి, కారంపూడి మైనార్టీ వర్గమైన జెడ్పీటీసీ షేక్ షఫీ, దుర్గి మండలంలో ఊరిబండి యేగయ్య, అదే మండలంలో బీసీ వర్గానికి చెందిన చల్లా శ్రీను, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, ఎస్సీ లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ బూదాల మరియమ్మ, గ్రీనరీ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ మైనారీ ఉప్పలపాటి జాని, కృష్ణ బలిజ అంజిని రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. నియోజక వర్గంలోని 76 సర్పంచ్ పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించి అందరూ ఏకగ్రీవమయ్యేటట్లు చేశారు. అదే విధంగా ఎంపీపీ విషయంలో 40 మంది ఎస్సీ వర్గానికి చెందినవారిని ఎంపిక చేశారు. శ్రీలక్ష్మీచెన్నకేశవ ట్రస్టు బోర్డు, వివిధ పదవులకుపై వర్గాలకు మొదటి ప్రాధాన్యతనిచ్చి మొత్తం నియోజక వర్గంలో 60శాతంకి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చిన ఘనత ప్రభుత్వ విప్ పీఆర్కేకు దక్కుతుంది. నియోజక వర్గ చరిత్రలో అధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అవకాశం కల్పించి ప్రతి వర్గానికి సామాజిక న్యాయం చేశారు. దీంతో ఆ వర్గాలన్నీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పీఆర్కేలకు జేజేలు పలుకుతూ వైఎస్సార్ సీపీ వెంట నడుస్తున్నారు.

మున్సిపల్ చైర్మన్‌గా మాచర్ల చిన ఏసోబు

మాచర్ల: పురపాలక సంఘం చైర్మన్‌గా మాచర్ల చిన ఏసోబు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో అన్నివర్గాలకు ప్రాధాన్యమిచ్చేలా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల కో–ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల ఆధ్వర్యంలో ఒప్పందం చేశారు. అందులో భాగంగా మూడవ సంవత్సరం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాచర్ల చినఏసోబు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం పురపాలక సంఘ ప్రాంగణంలో వేలాదిమంది మధ్య ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పురపాలక సంఘ మంత్రి ఆదిమూలపు సురేష్, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటికే భారీస్థాయిలో పార్టీ నాయకులు, ప్రజలు తరలిరానున్నారు. కమిషనర్ ఈవీ రమణబాబు, పురపాలక సంఘ అధికారుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమానికి పట్టణంలో భారీస్థాయిలో ఫ్లెక్సీల ఏర్పాటు చేశారు. ఎటు చూసినా చిన ఏసోబు బాధ్యతల స్వీకరణ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌ల ఆధ్వర్యంలో తరలిరానున్నారు.

స్మశాన స్థలాన్ని పరిరక్షించాలని వినతి



కారెంపూడి: స్థానిక దాచేపల్లి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి పక్కనున్న ఎస్సీ మాలల స్మశాన స్థలం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కారెంపూడికి చెందిన ఎస్సీ వర్గీయులు పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను కలసి బుధవారం వినతిపత్రం అందించారు. స్మశానం స్థలం ఆక్రమణలకు గురి కాకుండా, పరిరక్షించాలని వినతిపత్రంలో వారు కోరారు. ఆక్రమణలకు పాల్పడే వారిపై తగిన చర్యలు తీసుకుని, స్థలానికి హద్దులు నిర్ణయించి పరిరక్షించాలని కలెక్టర్‌కు విన్నవించారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



పిడుగురాళ్ల: యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం యూటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. విజయసారథి మాట్లాడుతూ సంఘం ఆవిర్భావం 1974లో జరిగిందని, ఈ కాలంలో విద్యారంగాన్ని కాపాడడం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఖాశీం పీరా, జిలా ఆడిట్ కమిటీ కన్వీనర్ జమాల్ పాల్గొన్నారు.

ఓటరు సర్వే పారదర్శకంగా ఉండాలి: ఆర్డీఓ

గురజాల: ప్రతి ఇంటికి వెళ్లి బీఎల్ఓలు చేపడుతున్న ఓటర్ సర్వేను పారదర్శకంగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని రెవెన్యూ డివిజన్ అధికారి కె.అద్దెయ్య సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న డోర్ టు డోర్ సర్వేను ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఓటర్ల మార్పులు చేర్పులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులతో భూ రీ సర్వేపై సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రీ సర్వేలో ఎటువంటి పొరపాట్లుకు తావివ్వకుండా జాగ్రత్తగా సర్వే చేపట్టాలన్నారు. అసైన్డ్ భూములు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జగనన్నకు చెబుతాం.. ఓటీసీ, ఓటీఎస్, ఏపీ సేవాల్లో ఏమైనా పెండింగ్ ఉంటే వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ పరిపాలనాధికారి శనగల శివనాగిరెడ్డి, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎలక్షన్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి సెల్ఫీ ఛాలెంజ్‌ను ఎందుకు స్వీకరించలేదు?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పిడుగురాళ్ల: గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఇచ్చిన ఛాలెంజ్‌ని ఎవరూ స్వీకరించలేకపోయారని, సెల్ఫీ చాలెంజ్‌లు చేసేవారు కాసు మహేష్‌రెడ్డి ఇచ్చిన అభివృద్ధి సెల్ఫీ ఛాలెంజ్‌ను ఎందుకు స్వీకరించలేకపోయారని గురజాల నియోజకవర్గ యువజన నాయకులు ప్రశ్నించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈవినింగ్ వాక్ లాగా నారా లోకేష్ యాత్ర సాగుతోందని, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధితో ఇక జన్మలో అధికారంలోకి రామని తెలిసి పిచ్చిపిచ్చిగా ఏదేదో మాట్లాడి వెళ్లిపోతున్నారని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అక్రమ మైనింగ్ డాన్‌గా రాష్ట్రవ్యాప్తంగా పేరుతెచ్చుకున్నాడని, అలాంటి యరపతినేని నేడు మైనింగ్ గురించి మాట్లాడటం విడ్డురంగా ఉందన్నారు. గతంలో యరపతినేని చేసిన వికృతచేష్టలు ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. పల్నాడు ఉన్నంత వరకు నాగార్జున సాగర్ కట్టింది కాసు ఫ్యామిలీనేనని, పిడుగురాళ్ల పట్టణంలోని మెడికల్ కళాశాల కట్టేది కాసు ఫ్యామిలీ అని ప్రజలంతా చెప్పుకుంటారని, యరపతినేని మాత్రం మైనింగ్ డాన్‌గా మిగిలిపోతాడని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, కౌన్సిలర్ పసుపులేటి ఆనంద్, ఎండీ హలీమ్, పట్టణ యూత్ అధ్యక్షుడు మందా సుధీర్, మార్కెట్ యార్డు డైరెక్టర్ జాషువా తదితరులు ఉన్నారు.

నాలుగు నామినేషన్లు దాఖలు

మాచవరం: మండలంలోని మోర్జంపాడు ఒకటో వార్డు, పిల్లుట్ల తొమ్మిదోవార్డుకు ఈనెల 19న జరిగే ఎన్నికలకు నాలుగు నామినేషన్లు అందినట్లు ఈఓ ఆర్డీ వెంగళరావు తెలిపారు. మోర్జంపాడులో ఓసీ మహిళ రిజర్వేషన్‌కు బత్తుల రమాదేవి, కంకర పార్వతమ్మలు, పిల్లుట్ల 9వ వార్డుకు బాహోటం వెంకటలక్ష్మి, ముజావర్ మీరాబీలు నామినేషన్లు వేసినట్లు తెలిపారు. ఈ నెల 14న నామినేషన్ల ఉపసంహరణ, 19న ఎన్నిక జరుగుతుందన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మరువలేనివి



దుర్గి: మండల కేంద్రమైన దుర్గిలో గురువారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీహెచ్ఎస్ స్కూల్ ఆవరణలో శిలాఫలకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులను స్మరిచుకుంటూ మొక్కలను నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి జాతీయ జెండాను ఎగురవేశారు. నేలతల్లికి, అమరవీరులకి వందన సమర్పణ చేశారు. మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, ఎంపీపీ ఏసూరి సాయిశంకర్, జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, ఎంపీడీఓ కె.సమతావాణి, సర్పంచ్ రాయపాటి మాణిక్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

రాజుపాలెం: మండలంలోని రాజుపాలెంకు చెందిన కేదారి శ్రీనివాసరావు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. దీనికి గాను వైఎస్సార్ బీమా ద్వారా రూ.లక్ష మంజూరయ్యాయి. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలను భార్య నాగలక్ష్మికి సర్పంచ్ పులిబండ్ల అశోక్, ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణలు గురువారం అందించారు. మిగిలిన రూ.90 వేలు త్వరలో ఖాతాలో జమ అవుతాయని తెలిపారు.

విలువలతో కూడిన విద్యనందిస్తున్నాం

పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లో ఎంఈఓ పినాకపాణి



విద్యార్థులకు ప్రొగ్రెస్ రిపోర్ట్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

దాచేపల్లి: విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తున్నామని ఎంఈఓ పినాకపాణి అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు గురువారం జరిగాయి. ఉపాధ్యాయుల పనితీరుపై చర్చించారు. విద్యార్థులకు బోధిస్తున్న విద్య విధానం, పాఠశాలల అభివృద్ధిపై కూడా చర్చించి పలు సూచనలు, సలహాలు అందించారు. జగనన్న గోరుముద్ద అమలు తీరుపై పలువురు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభవంతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యను అందిస్తున్నామని, ప్రభుత్వం కల్పించిన అవకాశాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు సలహాలు ఇవ్వాలని, ఉపాధ్యాయుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. ఈ సమావేశాల్లో ప్రధానోపాధ్యాయులతో పాటుగా సీఆర్పీలు అబ్రహాం, చంద్రమోహన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

'ఎస్‌కేబీఆర్' కళాశాల అభివృద్ధికి సహకరించండి



కళాశాలకు కుర్చీలు, పోడియం అందజేస్తున్న దృశ్యం

మాచర్ల: పట్టణంలోని ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ కమిటీ వస్తున్న సందర్భంగా కోలా అమర్‌జ్యోతిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య ఝాన్సీ రూ. 40వేల విలువైన 60 కుర్చీలను, చక్రధర్ డిగ్రీ కళాశాల తరపున పోడియంను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్, కమిషనర్ ఈవీ రమణబాబు, ఎస్‌బీఐ ప్రధాన శాఖ మేనేజర్ కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలకు మంచి పేరు తీసుకురావటానికి తమ వంతుగా సహాయ సహకారాలందిస్తామన్నారు. నీటి సరఫరా, టాయిలెట్ల ఏర్పాటు, గ్రీనరీ రంగుల వేయించటానికి దాతలు సహకరించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ కుమారి కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, డిప్యూటీ రిటైర్డ్ డీఈఓ గాదె రామకృష్ణారావు, గాదె కిరీటీరెడ్డి, షేక్ గౌస్, పఠాన్ నాగూర్ వలి, కౌన్సిలర్ కరిముల్లా తదితరులున్నారు.

ఒప్పిచర్లలో పొలం బాటల అభివృద్ధి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో పొలం బాటల అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుల ఆధ్వర్యంలో రైతులు గురువారం చేపట్టారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పంపిన పొక్లెయినర్, టిప్పర్ల సాయంతో రైతులు పొలం బాటలను అభివృద్ధి చేసుకునే పనులు ప్రారంభించారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య, గ్రామ సర్పంచ్ ఇరికెదిండ్ల రమణ కొండలు, మాజీ ఎంపీటీసీ ఓగూరి రామయ్య తదితరులు కొబ్బరి కాయలు కొట్టి పనులను ప్రారంభించారు. గ్రామంలో తొమ్మిది పొలం బాటలున్నాయని, వాటికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి బాటలకు గ్రావెల్ తోలి చదును చేయనున్నారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ప్రత్యేక శ్రద్ధతో పొలం బాటలను అభివృద్ధి చేస్తున్నారని మాజీ ఎంపీపీ చినవెంకటనర్సయ్య ఈ సందర్భంగా పేర్కొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ



కారెంపూడిలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి దుర్గారావు, జెడ్పీటీసీ షఫీ



పిడుగురాళ్లలో చిన్నారులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు వేస్తున్న డాక్టర్ రమాదేవి



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

కారెంపూడి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులకు నులి పురుగుల నివారణకు ఆల్‌బెండాజోల్ 400 ఎంజీ మాత్రలను మండల వైద్య ఆరోగ్యశాఖ గురువారం పంపిణీ చేసింది. స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ షేక్ షఫీ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గారావు, డాక్టర్ ఎం.రమ్య, సూపర్‌వైజర్ మల్లయ్య పాల్గొని విద్యార్థులచే ఆల్‌బెండాజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గారావు మాట్లాడుతూ ఈ మాత్రలు రక్తహీనతను నివారిస్తాయని, తీసుకున్న ఆహారం ద్వారా పోషకాలు శరీరం తీసుకునే గ్రాహ్యతను పెంచుతుందని, పరోక్షంగా చదువుపై శ్రద్ధను ఏకాగ్రతను పెంచుతాయని వివరించారు. హెచ్ఎం అనంతశివ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దాచేపల్లిలో...

దాచేపల్లి: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల టాబ్లెట్స్‌ను గురువారం అందించారు. వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌భాషా, పీహెచ్‌సీ డాక్టర్ సుచరిత, హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్: మండలంలోని తాళ్ళపల్లి జెడ్పీ హై స్కూల్‌లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా గురువారం విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ కోటేశ్వరరావు, డాక్టర్ వెస్లి పాల్గొన్నారు.

మాచవరంలో...

మాచవరం: జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం పందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల, కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న సుమారు 8400 విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, వైస్ ఎంపీపీలు నన్నేషైదా, లక్ష్మయ్య, జడ్పీటీసీ శివాయాదవ్, మండల కన్వీనర్ సింగరయ్య, ఎంపీడీఓ వరప్రసాద్, డాక్టర్ చంద్రహాసిత పాల్గొన్నారు.

దాచేపల్లి: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం గురువారం నిర్వహించారు. నారాయణపురంలోని కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవంను నిర్వహించి జెండాను ఎగుర వేశారు. మండలశాఖ ప్రధాన కార్యదర్శి తగరం ఆనంద్‌కుమార్, అదనపు కార్యదర్శి వాసుదేవరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పిడుగురాళ్ల పీహెచ్‌సీ పరిధిలోని 8 సచివాలయ పరిధిలో ఉన్నటువంటి అంగన్‌వాడీ కేంద్రాలు, గవర్నమెంట్, ప్రైవేటు స్కూల్, కాలేజీల్లో 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ ఆల్బెండజోల్ మందులను పంపిణీ చేశామని డాక్టర్ రమాదేవి తెలిపారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెంటచింతలలో...

రెంటచింతల: మండల పరిధిలోని గ్రామాలలోని 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసి నులి పురుగులను నివారిద్దామని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. గురువారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆంజనేయస్వామిమాణ్యం కాలనీలోని ఎంపీయూపీ పాఠశాలలోని విద్యార్థులకు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డిలతో కలిసి ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. స్కూల్ హెచ్ఎం నాగేశ్వరరావు నాయక్, సీహెచ్ఓ పూజల నాగేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురుగు మందుల వాడకం తగ్గించాలి

దాచేపల్లి: పంటల సాగులో పురుగుల వాడకం తగ్గించాలని వ్యవసాయశాఖ పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని యర్రంశెట్టి స్వామి పొలంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పొలంబడిలో సమగ్ర సస్యరక్షణ క్షేత్రం, ప్రయోగ క్షేత్రం, రైతు పద్ధతిలో విభజించుట మొదలైనవాటిపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం పంటలు బెట్ట పరిస్థితిలో ఉన్నాయని, పత్తిలో పచ్చదోమ, తామర పురుగు ఉధృతిని తగ్గించేందుకు లీటర్ నీటిలో 10 గ్రాముల చొప్పున మల్టికే, 3 గ్రాముల చొప్పున ఎసిఫేట్ పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ డి.పాపకుమారి తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

కారెంపూడి: డబ్బులిచ్చి ప్రజలను తరలించి నారా లోకేష్ చేసే పాదయాత్రల వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని, అయితే అభివృద్ధికి చిరునామాగా ప్రజల మనసెరిగిన నేతగా ఉన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై అనుచిత అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. వారు గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ లోకేష్ కారెంపూడి పాదయాత్ర సభలో ప్రభుత్వ విప్ పీఆర్కే సోదరులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని లోకేష్ వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ప్రజలచే ఎన్నికైన ప్రజా నాయకుడిని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. దమ్ముంటే 2024లో ఎన్నికలలో గెలిచి అప్పుడు మాట్లాడాలని సవాల్ చేశారు. అరాచకాలు అన్యాయాలు దౌర్జన్యాలకు మండలంలో కేరాఫ్ అడ్రస్ టీడీపీ నాయకులనేది జగమెరిగిన సత్యమని ఇప్పుడు ముమ్మాటికీ ప్రతి గడప అభ్యున్నతి కోరే సంక్షేమ అభివృద్ధి ప్రభుత్వం నడుస్తోందన్నారు. అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు బద్దూరి శ్రీనివాసరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, బైరెడ్డి చినశ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పెదమక్కెనలో 'నా భూమి–నా దేశం'

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): సత్తెనపల్లి మండలంలోని పెద మక్కెన గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నా భూమి - నాదేశం కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు.